


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 17-10-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 48 సంచిక : 33 పేజీలు : 08 వెల : 1 రూపాయి



# ఐటీ హబ్‌గా విశాఖ

- వైజాగ్ కలల నగరంగా అభివృద్ధి చెందబోతోంది
- ఐటీ హిల్స్ వద్ద ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎం జగన్
- ఏపీలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం
- పరవాడ సెజ్‌లో ఫార్మా యూనిట్‌ను ప్రారంభించిన సీఎం జగన్
- డిసెంబర్ నాటికి విశాఖకు మకాం : సీఎం జగన్ కీలక ప్రకటన






విశాఖపట్నం/పరవాడ/అచ్యుతాపురం(విజయభాను న్యూస్) : రాష్ట్రంలో సంక్షేమం, సర్వతోముఖాభివృద్ధికి పెద్ద ఎత్తున అడుగులు పడ్డాయని, ఈ తరుణంలో రాష్ట్రంలోని అతి పెద్ద నగరం, పరిపాలనా రాజధాని విశాఖలో ఇన్ఫోసిస్ డేటా సెంటర్ ప్రారంభించుకోవడం హర్షణీయమని సీఎం జగన్ పేర్కొన్నారు. విశాఖపట్నం మధురవాడ ఐటీ హిల్ నెంబరు 2 వద్ద నిర్మించిన ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్, యూజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, పరవాడ ఫార్మాసిటీ, లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రేవేట్ లిమిటెడ్, లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ సంస్థలను సీఎం జగన్ సోమవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ ప్రతినిధులు నిలంజన్ రాయ్ (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్), నీలాద్రిప్రసాద్ మిశ్రా (వైస్ ప్రెసిడెంట్)లతో కలిసి ఇన్ఫోసిస్ కాన్ఫరెన్స్ హాలులో సీఎం జగన్ ఐటీ ఉద్యోగులతో మాట్లాడారు. ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవంలో తాను భాగం అయినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. విశాఖపట్నం నగరానికి విశేషమైన సామర్థ్యం ఉందని, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తరహాలో విశాఖపట్నం కూడా ఐటీ హబ్‌గా మారబోతోందని సీఎం జగన్ పేర్కొన్నారు. ఆ స్థాయిలో ఈ నగరానికి ప్రభుత్వ సహకారం అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ తరహా మెట్రో నగరం ఆంధ్రప్రదేశ్‌లో లేదని, ఐటీ, ఐటీ సేవలకు సంబంధించిన పరిశ్రమలు గతంలో విశాఖపట్నంలో ఏర్పాటు కాలేదన్నారు. వాస్తవానికి ఆ కంపెనీల ఏర్పాటుకు కావాల్సిన అన్ని అర్హతలు, సామర్థ్యం విశాఖలో ఉన్నప్పటికీ ఈ కంపెనీలన్నీ అప్పటి రాజధాని హైదరాబాద్ నగరంలోనే ఏర్పాటు అయ్యాయని తెలిపారు. అప్పట్లో విశాఖపట్నానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్న సీఎం జగన్ టైర్ 2 సిటీగా ఉన్న విశాఖకు టయర్ వన్ సిటీగా ఎదగడానికి కావాల్సిన సహకారం ప్రభుత్వం అందిస్తుందన్నారు.

**ఒక్క ఫోన్ కాలం దూరంలోనే మీ సీఎం జగన్**

టయర్ వన్ నగరంగా ఎదగడానికి ఈ రకమైన తోడ్పాడు విశాఖనగరానికి అవసరం. ఆ రకమైన తోడ్పాటును ఇన్ఫోసిస్ అందించగలదని నేను బలంగా నమ్ముతున్నాను. 3.28 లక్షల మంది ఉద్యోగులు, 18.5 బిలియన్ డాలర్ల రెవెన్యూ సామర్థ్యంతో ఉన్న ఇన్ఫోసిస్‌తో పాటు, టీసీఎస్, విప్రో వంటి సంస్థలు ఏ నగరం యొక్క ఐటీ స్వరూపాన్ని, ముఖచిత్రాన్ని అయినా పూర్తిగా మార్చివేస్తాయి. ఇప్పుడు తరువాయి 2లో..



అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఏపీ సెజ్‌లో లారస్ ల్యాబ్స్ యూనిట్ 2 ఫార్ములేషన్ బ్లాక్‌ను ప్రారంభించిన సీఎం వైయస్.జగన్, ఉమ్మడి విశాఖ జిల్లా ఇన్చార్జ్ వై వి సుబ్బారెడ్డి, మంత్రులు గుడివాడ అమర్నాథ్, స్థానిక ఎమ్మెల్యే రమణ మూర్తి రాజు, ఎమ్మెల్సీ వరదు కళ్యాణి, లారాస్ ల్యాబ్ ప్రతినిధులు.

## రూ.102 కోట్లు స్వాధీనం చేసుకున్నాం: ఐటీశాఖ





అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, దిల్లీ వ్యాప్తంగా అక్టోబరు 12 జరిపిన సోదాల గురించి ఐటీశాఖ వివరణ ఇచ్చింది. మొత్తం 55 చోట్ల సోదాలు నిర్వహించినట్లు తెలిపింది. గుత్తేదారులు, స్థిరాస్తి వ్యాపారుల నివాసాల్లో సోదాలు చేసినట్లు వెల్లడించింది. లెక్కల్లో చూపని రూ.102 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఐటీశాఖ అధికారులు చెప్పారు. ఇందులో 94 కోట్ల విలువైన నగదు, రూ.8కోట్ల విలువైన బంగారు నగలు ఉన్నట్లు పేర్కొన్నారు.




చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై

## విచారణ వాయిదా



అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ఉన్నత న్యాయస్థానం వెల్లడించింది. రాజధాని నగర బృహత్ ప్రణాళిక, ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలైన్‌మెంట్ నిర్ణయం వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని అందిన ఫిర్యాదు ఆధారంగా.. ఏపీ సీఐడీ తనపై నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని చంద్రబాబు పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే.



విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు, శంకుస్థాపనలకు విచ్చేసిన ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని స్వాగతం పలుకుతున్న ఆంధ్రప్రదేశ్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్( ఏపీ ఎం.ఎస్.ఎం.ఈ.డీసీ), విశాఖ డైరీ చైర్మన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ మరియు నెడ్‌క్యాఫ్ చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కెకె రాజు

## త్వరితగతిన ధాన్యం సేకరణ ఏర్పాట్లు పూర్తిచేయాలి

### జాయింటు కలెక్టరు కె.ఎస్.విశ్వనాధన్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : ధాన్యం సేకరణకు సంబంధించిన ఏర్పాట్లను వారం రోజులలో పూర్తిచేయాలని జాయింటు కలెక్టరు కె.ఎస్.విశ్వనాధన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జాయింటు కలెక్టరు చాంబరు లో నిర్వహించిన సమావేశంలో ధాన్యం సేకరణ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు విశ్వనాధన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణకు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన పనులపై తీసుకున్నచర్యల నివేదికలను తదుపరి సమావేశంలో సమర్పించాలని, నిర్లక్ష్యం చేసిన అదికారులపై కఠిన చర్యలుతీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయశాఖ గ్రామ, మండల స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి రైతు భరోసా కేంద్రానికి నాలుగు లేక అయిదు వాహనాలు కేటాయించి ట్యాగింగు చేయించాలన్నారు.

మిల్లర్ల రిజిస్ట్రేషను, వే బ్రిడ్జి టాగింగు పూర్తిచేయాలని, సి.సి.కెమెరాలు, డయ్యర్లు సిద్దంచేయాలని, అవసరమైన గన్నీబ్యాగులు రైతుభరోసా కేంద్రంవారీగా సిద్దంచేయాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. ధాన్యం సేకరణకు సంబంధించి ఇ-క్రాప్, వాహనాలు గుర్తింపు రిజిస్ట్రేషను వివరాలను ప్రతిరోజు నివేదించాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో సివిల్ సప్లయి జిల్లా మేనేజరు ఐ. రాజేశ్వరి, జిల్లా సప్లయి అధకారి సూర్యప్రకాశరావు, వ్యవసాయశాఖ, మార్కెట్, రవాణాశాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐటీ హబ్‌గా విశాఖ










ఇన్ఫోసిస్ వస్తుంది. రానున్న రోజుల్లో మిగిలిన ఐటీ కంపెనీలు కూడా ఆ జాబితాలో చేరనున్నాయి. విశాఖలో ఆదానీ డేటాసెంటర్ కూడా రాబోతుంది. ఇంటర్నెట్ కేబుల్ మనకు ఎక్స్‌క్లూసివ్‌గా సింగ్‌పూర్ నుంచి వస్తుంది. రాబోయే రెండేళ్లలో డేటా సెంటర్ రానుంది. క్లౌడింగ్‌తో పాటు ఐటీ రంగంలో చాలా మార్పులు రానున్నాయి. ఇవన్నీ సాకారం కానున్నాయి. ఇప్పటికే ఇన్ఫోసిస్ వచ్చింది. అని సీఎం జగన్ పేర్కొన్నారు. నిలంజన్, నీలాద్రిప్రసాద్, సురేష్, రఘు వంటి ఐటీ నిపుణులతో మాట్లాడిన తర్వాత వీళ్లంతా కచ్చితంగా ఒకరోజు విశాఖ ఐటీలో అద్భుతాలు సృష్టిస్తారని బలంగా నమ్ముతున్నానని సీఎం జగన్ అన్నారు. ఇవాళ 1000 మందితో ఇక్కడ ప్రారంభం అయిన ఇన్ఫోసిస్ రానున్న రోజుల్లో మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తున్నానట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ ఇన్ఫోసిస్‌తో కలిసి ఐటీ రంగంలో బహుముఖ ప్రగతిని సాధిస్తుందని సీఎం జగన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఏ అవసరం ఉన్నా మేం కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉంటానని, దీన్ని పారిశ్రామిక వేత్తలు దృష్టిలో పెట్టుకోవాలని, మీకు ఏ అవసరం వచ్చినా అండగా నిలబడతామని మరోసారి హామీ ఇస్తున్నా అని సీఎం జగన్ పేర్కొన్నారు.

**2 పోర్టులు,రెండేళ్లలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ : సీఎం జగన్**

విశాఖపట్నం, గంగవరంలో ఇప్పటికే రెండు బలమైన పోర్టులు ఉన్నాయని, వీటితో పాటు శ్రీకాకుళంలో కూడా మూడో పోర్టు వస్తుందని సీఎం జగన్ పేర్కొన్నారు. మరో రెండేళ్లలోనే ఇక్కడే అత్యంత సుందరమైన అంతర్జాతీయ పౌర విమానాశ్రయం అందుబాటులోకి రాబోతుందన్నారు.



"నేను కూడా త్వరలోనే విశాఖకు షిఫ్ట్ అవుతాను. అధికారులు మన ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అంశాలకు సంబంధించిన ఏర్పాట్లలో ఉన్నారు. ముఖ్యమంత్రితో పాటు సీఎంఓ కార్యాలయ అధికారులు, ఇతర సిబ్బంది అంతా విశాఖకే వస్తారు. డిసెంబరులోపే విశాఖకు మారుతాం. నేను కూడా విశాఖలోనే నివాసం ఉంటాను. అని సీఎం జగన్ పేర్కొన్నారు. విశాఖలో ఇప్పటికే అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలు ఏర్పాటు అయ్యాయని ఈ సందర్భంగా సీఎం జగన్ పేర్కొన్నారు. 14 ఇంజనీరింగ్ కాలేజీలు, 8 యూనివర్సీలు, 4 మెడికల్ కాలేజీలు, 12 డిగ్రీ కాలేజీలతో విశాఖపట్నం ఎడ్యుకేషన్ హబ్‌గా తయారయిందన్నారు. ఏడాదికి దాదాపు 12 వేల నుంచి 15 వేల మంది ఇంజనీర్లు డిగ్రీలు పూర్తిచేసుకుని వస్తున్నారన్నారు. వీటితో పాటు ఐఐఎం, నేషనల్ లా యూనివర్సిటీ వంటి అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలు కూడా విశాఖపట్నంలో ఉన్నాయన్నారు. ఈ విశాఖలోనే దాదాపు 20 వేల నేవల్ అధికారుల కుటుంబాలతో కూడిన ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఐఓసీ వంటి పబ్లిక్ సెక్టార్ సంస్థలు కూడా ఉన్నాయి" సీఎం జగన్ పేర్కొన్నారు.

**సీఎం జగన్ విశాఖలో ప్రారంభించిన సంస్థలు ఇవే..**

**ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్....**

ఇన్ఫోసిస్ విశాఖపట్నంలో ఒక కొత్త డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం రూ. 35 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసిన ఈ సెంటర్ భవిష్యత్‌లో మరింతగా విస్తరించనున్నారు. ఇది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా పనిచేస్తుంది. దీని ఇంటీరియర్ డిజైన్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైబ్రీడ్ వర్క్‌ప్లేస్‌గా రూపొందించారు.

దాదాపు 1000 మంది ఉద్యోగులు ఈ సెంటర్ నుంచి పనిచేయనున్నారు. గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా ఈ కార్యాలయాన్ని నిర్మించారు. అత్యంత అధునాతన సదుపాయాలతో విశాలమైన ఆడియో, వీడియో కాన్ఫరెన్స్ హాల్స్, అధునాతన కెఫ్‌టేరియా, విశాలమైన పార్కింగ్ సౌకర్యాలతో తీర్చిదిద్దారు.

**యూజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, పరవాడ ఫార్మాసిటీ.....**

ఫార్మా, బయోటెక్ ఉత్పత్తులకు సంబంధించి రూ. 300.78 కోట్లతో పరవాడ ఫార్మాసిటీలో నిర్మించిన ఈ యూనిట్‌ను సీఎం ప్రారంభించనున్నారు. ఈ యూనిట్ ద్వారా 800 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.

**లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రేవేట్ లిమిటెడ్....**

యాక్టివ్ ఫార్మాసిటికల్ ఇంగ్రీడియంట్ (ఏపీఐ) ఉత్పత్తులకు సంబంధించి రూ. 421.70 కోట్లతో అచ్యుతాపురంలో నిర్మించిన ఈ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ యూనిట్ ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాల కల్పన జరగనుంది.

**లారస్ ల్యాబ్స్ లిమిటెడ్....**

అచ్యుతాపురం ఏపీసెజ్‌లో లారస్ ల్యాబ్స్ లో నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని, యూనిట్ 2 ఫార్ములేషన్ బ్లాక్‌ను సీఎం జగన్ ప్రారంభించారు. దీంతో పాటు లారస్ ల్యాబ్స్ నూతన పరిశ్రమకు కూడా భూమి పూజ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, విశాఖపట్నం ఇంచార్జ్ మంత్రి ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల ఇన్చార్జ్ వైవి సుబ్బారెడ్డి, ఎంపీలు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు అనుబంధ సంఘాల అధ్యక్షులు అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

---

# జీవశాస్త్రాలదే భవిష్యత్

- ప్రకృతి వైపరీత్యాలకు విరుగుడు జీవశాస్త్రాలే
- ఏయూ వృక్షశాస్త్ర ఆచార్యులు డాక్టర్ రత్నకుమార్



విశాఖపట్నం(విజయభాను న్యూస్) : 'విస్తరిస్తున్న ప్రకృతి వైపరీత్యాలకు విరుగుడు చూపేది జీవశాస్త్రలే 'నని ఆంధ్ర విశ్వ విద్యాలయం వృక్షశాస్త్ర ఆచార్యులు డాక్టర్. రత్నకుమార్ విద్యార్థులకు తెలియజేశారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్ మెంట్ కళాశాల జీవశాస్త్ర విభాగ విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ లో భాగంగా 'సముద్ర, వృక్ష సంపదలు. ఆరోగ్యకర మానవ సమాజ నిర్మాణం 'అనే అంశంపై చేస్తున్న పర్యటనలో భాగంగా ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆచార్యులను కలసి తమకు కావలిసిన విషయ సేకరణ చేశారు. విశ్వ విద్యాలయం ఆచార్యులు డాక్టర్ రత్నకుమార్, డా.జానకిరామ్ విద్యార్థులకు కావలిసిన దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంను సోమవారం ఉదయం శ్రీకాకుళం గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ డా. పులఖండం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో కళాశాల అద్యాపకులు ధన్వంతరి,జ్యోతి ప్రసాద్, ఉమామహేశ్వరీ, తనూజా తదితరులు పాల్గొన్నారు.



---

## సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన సిఇసి సభ్యులు పైలా

**శ్రీను అన్నా బాగున్నావా అంటూ.. సీఎం జగన్ పలకరింపు**



పరవాడ:-పరవాడ మండల జె ఎన్ పి సి ఫార్మసీటీ లో నూతనంగా నిర్మించిన యూజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ని పూల బొకే ఇచ్చి రాష్ట్ర సిఇ సి సభ్యులు పైల శ్రీనివాసరావుమర్యాదపూర్వకంగా కలిశారు... అనంతరం శ్రీను అన్న బాగున్నావా అంటూ ఆత్మీయపలకరింపు చేశారు.

---

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




రాజాం (విజయభాను న్యూస్) : బాల్య వివాహాలు చట్టరీత్యానేరమని ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంతో పాటు గడిముడిదాం, బొద్దాం, పొగిరి, పెనుబాక తదితర గ్రామాల్లో బాల్య వివాహాలు నిషేదం, కలిగే అనార్ధాలుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. పెద్ద ఎత్తున ప్రజలు, యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఈఓపీఆర్డీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

---

## జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఒక వరం


**కలపాక సర్పంచ్ బోండా కనకరావు**



పరవాడ:- పరవాడ మండలం కలపాక పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ బోండా కనకారావు హాజరై ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరుపేదల పాలిట గొప్ప వరమని కొనియాడారు... ఈ కార్యక్రమంలో చీపురుపల్లి పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ కనకప్పారావు, డాక్టర్ సావ్య, డాక్టర్ రాజ్ ప్రేమ్, డాక్టర్ ఆస్మా ఆక్తర్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్టులను అందజేశారు.. సుమారు295మంది రోగులకు కావలసిన మందులు పంపిణీ చేశారు... 150 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి వాళ్లకి కావలసిన కళ్ళద్దాలను పంపిణీ చేస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో పి. బోనంగి సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి సుభాష్ , మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, జే సి ఎస్ మండల కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు సచివాలయం సిబ్బంది మరియు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు..

---

## మహేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన రాజశ్యామల అమ్మ వారు



పెందుర్తి(విజయభాను న్యూస్) : రాజశ్యామలా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు విశాఖ శ్రీ శారదాపీఠంలో కొనసాగుతున్నాయి. రాజశ్యామల అమ్మవారు సోమవారం శ్రీ మహేశ్వరీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వరాలిచ్చే తల్లిగా అభయ హస్తం, కోపాన్ని, అహాన్ని హరించేందుకు త్రిశూలం, వేదాలను పరిరక్షించేందుకు జింక, పరశులను చేతపట్టి మహేశ్వరి అమ్మవారు భక్తలను అనుగ్రహించారు. తమిళనాడుకు చెందిన అలంకార భట్టర్లు ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించారు. మహేశ్వరి అవతారంలో దర్శననమిచ్చిన రాజశ్యామల మాతకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములు హారతులిచ్చారు. అనంతరం పీఠం ఆధిష్టాన దైవం రాజశ్యామల అమ్మవారి నిజరూపానికి స్వాత్మానందేంద్ర స్వామి పంచామృతాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. అంతకుముందు పీఠ ప్రాంగణంలోని దేవతామూర్తుల ఆలయాలను సందర్శించారు. అలాగే శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణ చేసారు. రామాయణ వైశిష్ట్యాన్ని టీటీడీ పండితులు డాక్టర్ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి ప్రవచనం ద్వారా వివరించారు.

## సముద్ర తీర పరిశుభ్రతకు, పరిరక్షణకు ఆదునికతో కూడిన

# బీచ్ క్లీనింగ్ మెషిన్ వాహనాలు అవసరం

**బీచ్ క్లీనింగ్ మెషిన్‌వాహనాలను ప్రారంభించిన సీఎం జగన్**





విశాఖపట్నం(విజయభాను న్యూస్) : మహా విశాఖ నగరంలో బీచ్ లను పరిశుభ్రపరచుటకు ఆధునికతతో కూడిన సాంకేతిక పరమైన బీచ్ క్లీనింగ్ వాహనాలు విశాఖ నగర సుందరీకరణకు చాలా అవసరమని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మధురవాడ ఐటి సెజ్ హిల్-3 నందు రూ.13 కోట్ల వ్యయంతో జివిఎంసి ఏర్పాటు చేసిన ఆరు బీచ్ క్లీనింగ్ వాహనాలను ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముందుగా వాహనాల పనితీరును అక్కడ ఏర్పాటు చేసిన వీడియో ప్రదర్శన ద్వారా తిలకించిన తదుపరి ఒక వాహనాన్ని అధిరోహించి డ్రైవర్ కూర్చున్న చోట కేబిన్ తో పాటు ఎయిర్ కండిషన్ ఏర్పాటు చేయాలని అధికారులకు, వాహనాల తయారీ సంస్థ ప్రతినిధులకు సూచించారు. విశాఖ నగరానికి సముద్రతీరం తలమానికమని, ఈ సముద్ర తీర పరిశుభ్రతకు, పరిరక్షణకు ఆదునికతో కూడిన బీచ్ క్లీనింగ్ మెషిన్ వాహనాలు ఎంతో అవసరమని, ఈ వాహనాల ద్వారా విశాఖ నగర బీచ్ లలో వ్యర్థాలను వెలికి తీయడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చునని, తద్వారా విశాఖ నగరంలో క్లీనర్ బీచ్ పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాలు పామ్ టెక్ సంస్థ జర్మన్ టెక్నాలజీతో తయారు చేసిందని, మూడు సంవత్సరాలు ఆపరేషన్ మరియు మెయింటినెన్స్ కొరకు ఆ సంస్థకు జివిఎంసి ఇవ్వడం జరిగిందని, 100 మీటర్ల వెడల్పు, 2 కిలో మీటర్ల పొడవు కల్గిన బీచ్ ప్రదేశాన్ని 100 మందితో పరిశుభ్ర పరిస్తే.., ఈ ఒక్క మెషిన్ మాత్రం కేవలం 8 గంటలలోనే పరిశుభ్రపరుస్తుందని, బీచ్ లో 10 అంగుళాల లోతైన ఇసుక పొరలలో వ్యర్థాలను, కాలుష్య కారకాలను, సమర్ధవంతంగా తొలగించి తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో పరిశుభ్రపరుస్తుందని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, జివిఎంసి కమీషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, పామ్ టెక్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ప్రారంబోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మునిసిపల్ శాఖా మంత్రి అదిమూలపు సురేష్, ఐటి శాఖా మంత్రి గుడివాడ అమర్ నాద్, జిల్లా ఇంచార్జ్ మంత్రి విడదల రజని, ఉమ్మడి జిల్లా సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి, నగర మేయర్ గోలగాని హరి వెంకట కుమారి, శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, ఎం.ఎల్.సి. లు వరుదు కళ్యాణి, వంశీకృష్ణ యాదవ్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి , పామ్ టెక్ సంస్థ మేనేజర్ పంకజ్ మల్ హెూత్ర, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమీషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ, నెడ్క్యాప్ చైర్మన్ కె కె రాజు , డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ , ఇతర ఉన్నతాధికారులు, పలువురు వైఎస్ఆర్ నాయకుల తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రికి ఘన వీడ్కోలు




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలలో ఒక రోజు పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం 10.35 నిముషాలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకొన్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పర్యటన అనంతరం సాయంత్రం 3:50 గంటలకు తిరిగి విశాఖ విమానాశ్రయానికి చేరుకొన్నారు. అనంతరం 3:57 గంటలకు విజయవాడకు ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇంచార్జి మంత్రి మరియు ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఐటి శాఖామాత్యులు గుడివాడ అమర్ నాద్, తితిదే మాజీ చైర్మన్ వై.వి.సుబ్బా రెడ్డి, విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా కలెక్టరు డా. ఎ.మల్లిఖార్జున, పోలిసు కమిషనరు ఎ.రవి శంకర్, జి.వి.యం.సి.కమిషనరు సాయికాంత్ వర్మ, డి.సి.సి.బి. చైర్మన్ కోలా గురువులు, ఆర్.డి.ఒ. హుస్సేన్ సాహెబ్ తదితరులు ముఖ్యమంత్రి కి ఘన వీడ్కోలు పలికారు.



## జగనన్నకు చెబుదాం అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

**- అర్జీదారుల్లో సంతృప్తిస్థాయి పెరగాలి - జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్**



విశాఖపట్నం(విజయభాను న్యూస్) : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారం మరియు పలు విషయాల పై అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి సమీక్షించారు. ఈ సందర్బంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంకు వచ్చే అర్జీదారులు పరిష్కార విషయంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. అలాగే రీఓపెన్ అయిన అర్జీలు, సంతృప్తి చెందని దరఖాస్తులు, ఏ.పి పోర్టల్ లలో పెండింగ్ లో ఉన్న అర్జీలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. వచ్చిన అర్జీలు నిర్ణిత గడువులోగా పరిష్కరించబడాలని ఆదేశించారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 151 విజ్ఞప్తులు అందాయి. ఈ కార్యక్రమంలో డిఎల్డిఓ పూర్ణిమా దేవి, జివిఎంసి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నీటి విలువ ప్రతి ఒక్కరూ గుర్తించాలి

**- ప్రకృతి వనరులు కలుషితం చేయరాదు -భావితరాలకు స్వచ్ఛమైన సమాజాన్ని అందించాలి**

**- ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం**




కంచరపాలెం (విజయభాను న్యూస్): సమాజంలో ప్రతి ఒక్కరు నీటి విలువలను గుర్తించాలని ప్రపంచ ఆహార దినోత్సవం 2023 సందర్భంగా స్థానిక ప్రభుత్వ కెమికల్ ఇంజ నీరింగ్ కళాశాలలో నీరే ప్రాణధారం – నీరే ఆహారం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎం ప్రసాద్ (ఎస్.బి.సి.సి, విశాఖపట్నం కలెక్టర్ ఆఫీస్ ) చే పోషకాహార లోపం, బాల్య వివాహాలు ,మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం మరియు వాష్ (పరిసరాల పరిశుభ్రత )వంటి సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వనరులు కలుషితం చేయకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో భావితరాలకు స్వచ్ఛమైన సమాజాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ వి.శ్రీకాంత్ మరియు స్టూడెంట్ అడ్వైజర్ బి. రామాంజనేయులు పాల్గొన్నారు.

# జగన్ రెడ్డి పార్టీకి నూకలు చెల్లిపోయాయి

**- ప్రభుత్వానికి ఇంకా మూడు నెలలు ముచ్చటే**

**- రాష్ట్ర ప్రతినిధిగా ఉన్న సీఎంను ప్రతిపక్షాలను కలవనీయకపోవడం ఘోరం**

**- మాజీమంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**



విశాఖపట్నం (విజయభాను న్యూస్): జగన్ రెడ్డి పార్టీకి నూకలు చెల్లిపోయాయని మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎప్పటి నుండో ముఖ్యమంత్రి పర్యటన గురించి ఊరిస్తున్నారు. గాలిలోనే వచ్చారు గాలిలోనే వెళ్లారు అని ఎద్దేవా చేశారు. ఒక ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వస్తే వివిధ రాజకీయ పార్టీల వారికి, ప్రజాసంఘాల వారికి సమయం కేటాయిస్తారు. కానీ ఆ తరహా పద్ధతులకు తిలోదకాలు ఇచ్చారు. ముఖ్య మంత్రిని కలిసేందుకు అనుమతి కోరుతూ జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం కూడా అందించాం.కానీ అది బుట్టదాఖలు అయింది ముఖ్యమంత్రి ప్రవర్తన విడ్డురంగా ఉందన్నారు.కేవలం వైసీపీ ముచ్చట మూడు నెలలే కనీసం ఇప్పటికైనా సీఎం వాస్తవాలు మాట్లాడాలి. దసరాకు కాదు క్రిస్మస్ కి విశాఖలో మకాం అంటున్నారు. అది కాస్త సంక్రాంతికి వెళ్లడం కాయం అనుభవమున్న రాజకీయనాయకులు వైసీపీ లో ఎందరో ఉన్నారు. వారిని చూస్తే జాలేస్తుంది సీఎం చెప్పిన గొప్పలు గత ప్రభుత్వాల హయాంలో వచ్చినవే వాటిని జగన్ రెడ్డి తెచ్చినట్టు గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటు. కొత్త వాటి మాట పక్కన పెడితే ఉన్నవాటినే కాపాడుకోలేని పరిస్థితిలో జగన్ సర్కార్ ఉంది.ఒక్కో ప్రాంతానికి ఒక్కో సామంతరాజుని నియమించి ప్రతిపక్షాలపై కక్ష సాధిస్తూ ముందుకు వెళ్తున్న జగన్ రెడ్డి పార్టీకి నూకలు చెల్లిపోయాయి. భీమిలి చుట్టుప్రక్కల ప్రాంతంలో విజయసాయి రెడ్డి ఇంచార్జ్ గా ఉన్న సమయంలో సుమారు 2లక్షల గజాలు కాజేశారు. ఉత్తరాంధ్రపై సవితి తల్లి ప్రేమ చూపిస్తూ ఈ ప్రాంతాన్ని ద్వేషిస్తున్నారు. మాజి మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఇవ్వాళ జగన్ ఇంకో కుంభకోణానికి పాల్పడ్డారు. పరవాడ లో రెండు రిజర్వాయర్ లో కుంభకోణానికి పాల్పడ్డారు ఒక రిజర్వాయర్ దొడ్డి దారిలో విజయసాయి రెడ్డి బంధువు కు అప్పగించారు.ఫార్మలో తాడి తరలింపు లో అన్యాయం చేస్తున్నారు.

తాడి గ్రామస్తులను పోలీసులు అడ్డుకున్నారు.ఈ సీఎం జిల్లా కు వచ్చి ఒక్క ఎమ్మెల్యే కు అపాయింట్ మెంట్ ఇవ్వలేదు.ప్రధాని మంత్రులు సైతం విశాఖ వస్తే ప్రతి పక్షాలకు సమయం ఇచ్చి సమస్యలు వినేవారు.సీఎం జగన్ మోహన్ రెడ్డి పెద్ద పెద్ద కంపెనీలను బెదిరించి డబ్బులు వసూలు చేసుకోవడానికి వచ్చారు.ఈ సీఎం జగన్ హెలి టూర్ మాత్రమే చేశారు తప్ప ఇంకేమి చెయ్యలేదు. మతి భ్రమించిన ముఖ్య మంత్రి పుస్తకం పట్టుకుని దసరా మాములు కు వచ్చారు అని అన్నారు.జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి హెలికాప్టర్ లో వచ్చారు, హెలికాప్టర్ లో వెళ్లారు ఎందుకు ప్రజాప్రతినిధులు అరెస్ట్ చేశారు.విశాఖ లో సీఎం పైన హెలికాప్టర్ లో వస్తే కింద ట్రాఫిక్ ఆపేస్తున్నారు ఇదేమి ఘోరం..జులై వస్తాను అన్నారు సెప్టెంబర్, అక్టోబర్ అయిపోయింది ఇప్పుడు డిసెంబర్ అంటున్నారు. మళ్ళీ వాయిదా వేస్తున్నారు అసలు సీఎం వస్తారా ఋషికొండలో నిర్మాణం సీఎం ఆఫీస్ , సీఎం క్యాంప్ ఆఫీస్ నా చెప్పాలి. కోటి రూపాయలు ఖర్చు చేయాలా రుషి కొండ అంటే బ్లూ ఫాగ్ బీచ్ పర్యావరణ విఘాతం కలిగించకూడదు.సీఎం జగన్ విశాఖ ను ఒక వ్యాపార కేంద్రం గా ఆలోచిస్తున్నారు.స్టీల్ ప్లాంట్ కార్మికులకు అపోయింట్మెంట్ కూడా ఇవ్వలేదు అని అన్నారు. సమావేశంలో అనకాపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవి రావు, శాసనసభ మాజీ సభ్యులు దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి, వివిధ నియోజకవర్గాల ఇన్చార్జిలు పి వి జి కుమార్, బత్తుల తాతయ్య బాబు, కోరాడ రాజబాబు, ప్రగడ నాగేశ్వరరావు, చిక్కాల విజయబాబు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అనంత లక్ష్మి, పార్లమెంట్ కార్యదర్శి గణగళ్ళ సత్య తదితరులు పాల్గొన్నారు .



మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎంవిపి కాలనీలోని తన నివాసంలో నలుపు రంగు బెలూన్స్ ఎగురవేసి నిరసన తెలియజేస్తున్న మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

# విజయభాను సంపాదకీయం

## ఆందోళన కలిగించే అంశం

కరోనా మహమ్మారి దెబ్బ నుంచి ప్రపంచం కోలుకోవాలి అన్న ఆశాభావం ఎంతగా వెల్లడి అవుతున్నా అందుకు అనుగుణంగా ప్రపంచ పరిణామాలు లేవు. తాజాగా అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వెల్లడించిన ప్రపంచ ఆర్థిక దృక్కోణం రానున్న రోజుల్లో ప్రపంచ ప్రగతి మరింత దిగజారనుందని జోస్యం చెప్పింది. ఇతరత్రా అనేక మంది ఆర్థికవేత్తల విశ్లేషణలు, దేశాలు, ప్రాంతాల పని తీరును చూసినా అధోగతి తప్ప పురోగతి కనుచూపు మేరలో కనిపించటం లేదు. గత ఏడాది ప్రపంచ వృద్ధి రేటు 3.5 శాతం ఉండగా వర్తమానంలో మూడు, వచ్చే ఏడాది 2.9 శాతానికి తగ్గుతుందని ఐఎంఎఫ్ చెప్పింది. రెండు వేల నుంచి 2019 వరకు సగటు వృద్ధి రేటు 3.8 శాతం ఉంది. అభివృద్ధి చెందిన దేశాల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ఐరోపాలో పెద్ద దేశమైన జర్మనీ పురోగమనం సంగతి దేవుడెరుగు తిరోగమనం లోకి దిగజారుతుందా అన్న భయాలు ఉన్నాయి. ఇప్పటికే రోగిగా మారినట్లు వర్ణిస్తున్నారు. ధనిక దేశాల వృద్ధి రేటు గతేడాది 2.6 శాతం ఉండగా ప్రస్తుత సంవత్సరంలో 1.5, వచ్చే ఏడాది 1.4 శాతానికి దిగజారుతుందని, అభివృద్ధి చెందుతున్న దేశాల వృద్ధి రేటు 4.1 నుంచి నాలుగు శాతానికి తగ్గుతుందని అంచనా. ఇవన్నీ కూడా ఇప్పుడున్న పరిస్థితి ఇలాగే ఉంటే అన్న ప్రాతిపదిక మీద చెప్పిన మాటలు. ఉక్రెయిన్ సంక్షోభం కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. ఐఎంఎఫ్ తాజా అంచనాలను రూపొందించే సమయానికి ఇజ్రాయిల్-పాలస్తీనా సంక్షోభం ఊహలో కూడా లేదు. అమెరికా తన ఆయుధ పరిశ్రమలకు లాభాలను సమకూర్చేందుకు ప్రపంచంలో ఎప్పుడు ఏ మూలన చిచ్చు పెడుతుందో, అది అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక వ్యవస్థలను ఎలా ప్రభావితం చేస్తుందో చెప్పలేము. ఇటువంటి స్థితిలో ఎగుమతుల మీద ఆశలు పెట్టుకున్న మనవంటి దేశాల పరిస్థితి అగమ్యగోచరం, దిగుమతులతో వాణిజ్య లోటు పెరుగుంది అన్నది వేరే చెప్పనవసరం లేదు. ఎగుమతుల్లో మిగులు ఉన్న చైనాకు వాణిజ్య మిగులు తగ్గవచ్చు తప్ప ఇప్పటికిప్పుడు లోటులో పడే అవకాశం లేదు.

పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా తన ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడేందుకు అమెరికా తీసుకుంటున్న చర్యలు యావత్ ప్రపంచాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. వడ్డీ రేటును పెంచటంతో ప్రపంచంలో ఉన్న డాలర్లన్నీ అమెరికాకు పయనం కట్టటం, దాని విలువ పెరగటంతో అనేక దేశాల కరెన్సీల విలువ పతనమౌతున్నది. అది కష్టజీవుల మీద ఎనలేని భారాన్ని మోపుతున్నది. 2022లో 8.7 శాతంగా ఉన్న ప్రపంచ ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతూ 2024లో 5.8 ఉంటుందని అంచనా. ఇదేమీ తక్కువ కాదు. రెండు శాతానికి పరిమితం చేయాలన్న ప్రపంచ ద్రవ్యోల్బణ లక్ష్యం ఎప్పటికి నేరవేరుతుంది అన్నది ప్రశ్నే. మన దేశంతో సహా అనేక దేశాలు తీవ్రమైన లోటును ఎదుర్కొంటున్నాయి. అమెరికా విత్తలోటు 8 నుంచి వచ్చే ఏడాదికి 7.4 శాతానికి, ఐరోపాలో 3.4 నుంచి 2.7 శాతానికి తగ్గుతుందని చెబుతున్నారు. మరోసారి ప్రపంచ మార్కెట్లో ఇంధన ధరల పెరుగుదల సూచనలు కనిపిస్తున్నాయి. ఎగుమతి దేశాలు తమను తాము కాపాడుకొనేందుకు ఉత్పత్తి, సరఫరాను తగ్గించాలన్న నిర్ణయం దిగుమతి దేశాలకు ఆశనిపాతమే. ఒకవైపు రష్యా ఇంధన ఎగుమతులపై అమెరికా, ఐరోపా దేశాలు ఆంక్షలు విధించి దాన్ని దెబ్బ తీయాలని చూస్తున్నాయి. రష్యా నుంచి ఐరోపాకు ఇంధన సరఫరా చేసే పైప్‌లైన్లను ధ్వంసం చేయించింది అమెరికాయే అనే వాస్తవాలు వెల్లడయ్యాయి. ఉక్రెయిన్ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకొని తన ఇంధనాన్ని ఎక్కువ ధరలకు ఐరోపాకు అంటగట్టేందుకు చేసిన కుట్ర ఇదని చెబుతున్నారు. తనను నమ్మిన దేశాలకే అమెరికా పంగనామాలు పెడుతోంది. ఇప్పటికే ఐరోపా దేశాలు ఇంధన ధరల పెరుగుదలతో సతమతమౌతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎంత మేరకు తట్టుకోగలవు అన్నది ప్రశ్న. అంతిమంగా కార్మికవర్గం మీదనే ఆ భారాలు మోపుతారన్నది వేరే చెప్పనవసరం లేదు.

ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్లుగా పెరిగిన ద్రవ్యోల్బణం గృహస్తుల పొదుపును ఇప్పటికే హరించింది. ఒత్తిడి తీవ్రత తగ్గింది తప్ప దాని పర్యవసానాలైన పెరిగిన రుణ భారం, ఇతర వ్యవస్థాగత ప్రతికూలతలు ఇంకా అలాగే ఉన్నాయి. ప్రపంచమంతటా వాణిజ్య విశ్వాస సూచిక దిగువ చూపులు చూస్తున్నది. గిరాకీ తగ్గుతున్నది, ఆ మేరకు ఉత్పత్తిని తగ్గిస్తే నిరుద్యోగం తీవ్రత పెరుగుతుంది. అది గిరాకీని మరింతగా తగ్గిస్తుంది. అలాంటపుడు కోలుకోవటం ఎలా అన్నది ప్రశ్న. తాజా ప్రపంచ ఆర్థిక దృక్కోణ నివేదిక వెల్లడించిన అంశాలు పరిస్థితి మరింతగా దిగజారటాన్నే సూచిస్తున్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం.

## నేవీ సివిలియన్ ఆఫీసర్స్ జనరల్ బాడీ మీటింగ్ మరియు నూతన కార్యవర్గం ఎర్పాటు






విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఇండియన్ నేవీ సివిలియన్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఈస్ట్రన్ నేవల్ కమాండ్ డివిజన్ జనరల్ బాడీ మీటింగ్ విశాఖ నగరంలోని రామా టాకీస్ రోడ్డులోని రెయిన్బో హెూటల్ వేదిక ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ టీ ఎన్ రాయ్, సీఏవో భవేశ్ కుమార్, ఎస్ఏవో, వైద్యాధికారి డాక్టర్ కె. సుజిత్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి అసోసి యేషన్ పనితీరు, ఆర్థిక నివేదికలను అందజేశారు.

ఈ సమావేశంలో భాగంగా 2023-2025 కాలానికి ఎన్నికలు నిర్వహించగా, ఎన్నికల అధికారులుగా డైరెక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ సి. ప్రవీణ్ కుమార్ వ్యవహరించారు. నూతన సంఘం అధ్యక్షులుగా జి. ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా పైలా శ్రీనివాస్, కోశాధికారిగా బి.వి. నరసింహం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్య క్షులుగా కె. రమేష్ కుమార్, బి.సర్దార్, కె.వి.ఎస్.ఎన్. రాజు, కార్య నిర్వహణ కార్య దర్శులుగా ఎస్. దేములు, ఎ.సి. గౌతమరావు ఎన్నికయ్యారు.

సంయుక్త కార్యద ర్శులుగా పి. వెంకట అప్పారావు, జి.ఉమామహేశ్వరరావు, ఎస్.ఎన్.సాహు, ఎండీ ఎన్వీ రావు, జి. సురేష్ బాబు, పి. దుర్గాప్రసాద్, సీహెచ్. సుధాకృష్ణమోహన్, సహాయ కార్యదర్శులుగా పి.అప్పలరాజు, పి. వాసుదేవరావు, ఎం. సీతారామ రాజు, కె. శాంతి స్వరూప్, ఎస్. శ్రీనివాస్ ఎన్నికయ్యారు.



## స్వరూపానందేంద్రను కలిసిన సంస్కృతం పండితులు



పెందుర్తి(విజయభాను న్యూస్): పదో తరగతిలో సంస్కృతం బాషను ప్రత్యేక బోధనాంశంగా గుర్తించేలా కృషి చేయాలని సంస్కృతం పండితులు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కోరారు. సంస్కృత భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పండితులు సోమవారం విశాఖ శ్రీ శారదాపీఠానికి వెళ్ళారు. పీఠాధిపతులను కలిసారు. పీఠాధిపతుల చొరవతో ఎస్ఎస్సీ పరీక్షల్లో వంద మార్కులకు ప్రశ్నపత్రాన్ని రూపొందిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ జీఓను ఏడాది కాలానికే పరిమితం చేసారని, ప్రతిఏటా ఇదేవిధంగా పరీక్షలు జరిపేలా చూడాలని విజ్ఞప్తి చేసారు. సంస్కృతం భాషకు ప్రాధాన్యత కొరవడుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ పరిస్థితుల్లో ఎస్ఎస్సీ స్థాయిలోనే ప్రత్యేక బోధనాంశంగా గుర్తిస్తే కొంత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈమేరకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసేలా ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. సంస్కృతం పండితుల విజ్ఞాపనపై సానుకూలంగా స్పందించిన స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములు ప్రభుత్వంతో చర్చిస్తామని హామీనిచ్చారు.

## మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏకగ్రీవ ఎన్నిక



సాలూరు విజయభాను న్యూస్ అక్టోబర్ 17 : బీమవరంలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ మునిసిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ యూనియన్ ఎన్నికల్లో ఎస్ కృష్ణ మోహన్ అధ్యక్షులు గా మరియు ఎస్ నాయుడు బాబు విశాఖపట్నం జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అని సాలూరు మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షులైన ఎస్ ఎఫ్ మహమ్మద్ మరియు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తెలిపారు. అదేవిధంగా విశాఖపట్నం జోన్ నుంచి సహాయక అధ్యక్షులు గా వై ఎస్ సి హెచ్ పాపయ్య రాజు విజయనగరం ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.ఫ్. అహ్మద్, సీనియర్ అసిస్టెంట్, సాలూరు పురపాలక సంఘం పార్వతీపురం మన్యం, మహిళా సెక్రటరీ గా శ్రీమతి జి. నీలిమ అనకాపల్లి జాయింట్ సెక్రటరీ గా, టి. గోవింద్ శ్రీకాకుళం, మరియు ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గా బి.శ్రీనివాస రావు శ్రీకాకుళం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## స్పందన కార్యక్రమం నకు 3 అర్జీలు

భీమునిపట్నం : విజయభాను న్యూస్ జోన్-I ,జివిఎంసి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంనకు 3 అర్జీలు వచ్చినట్లు సూపరింటెండెట్ తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగం: 1 ఇంజనీరింగ్ విభాగానికి 2, వచ్చినట్లు చెప్పారు.తదుపరి చర్యలకు సంబంధిత శాఖాధిపతులకు పంపడం జరిగిందనీ ఆయన అన్నారు.

## బాల్య వివాహాలు చేసుకోవడం వలన కలిగే నస్టాలు గురించి అవగాహన

భీమునిపట్నం : విజయ భాను న్యూస్ ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం "బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్" మరియూ " బాల్య వివాహ రహిత ఇండియా" లో భాగంగా సోమవారం భీమిలి మండలం లో ఉన్న అన్ని గ్రామ సంఘాలు లో బాల్య వివాహాలు చేసుకోవడం వలన కలిగే నస్టాలు గురించి విపులంగా చర్చించి, బాల్య వివాహాలు చేసుకోవడం వలన కలిగే అనర్ధాలు పై అవగాహణ కల్పించడం జరిగింది. మరియు సంఘ తీర్మానం పుస్తకాలలో "మా పిల్లలకు బాల్య వివాహాలు చేయం" అని తీర్మాణం చేయించడం జరిగింది.అదేవిదంగా బాల్య వివాహాలు పై ఎస్ ఈ. అర్ పి సి ఇ ఓ జూమ్ కాన్ఫరెన్స్ వ్ లో వివరించారు, తదుపరి బాల్య వివాహాలు పై సంఘ సభ్యులు తో "ప్రతిజ్ఞ"చేయించి, ర్యాలీ నిర్వహించారు ఈ కార్య క్రమానికి దాకమర్రి గ్రామములో మండల అద్యక్షులు దంతులూరి వాసురాజు , ఎం పి డి ఓ వేంకటరమణ , దాకమర్రి సర్పంచ్ పైడప్పడు , ఎం పి టి సి నగేష్ వై సి పీ పార్టీ అద్యక్షులు గాడు శ్రీను , ఈ ఓ పి అర్ డి అప్పల రాజు ఏ పి ఎం బి రంగారావు ,పంచాయతీ సెక్రటరీ రఘు తదితరులు పాల్గొన్నారు

## ఉచిత హెూమియో మెడికల్ క్యాంపు



భీమునిపట్నం : విజయభాను న్యూస్. స్థానిక ,చిన్నబజార్,లో ఉన్న కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత హెూమియో మెడికల్ క్యాంపు నిర్వహించారు ఇందులో 90 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసామని ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కి జగన్నాథరావు డీజే మోహన్ ఫౌండేషన్ ప్రతినిధులు కేఎస్ఎన్ మూర్తి కే చంద్రశేఖర్ కె.వి బానోజీ రావు కె శ్రీనివాసరావు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

# భక్తుల పాలిట పెన్నిధి కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి

### సంకీర్తన

శ్రీఆంజనేయస్వామి భక్తులపాలిట పెన్నిధి. నిత్యం రామ ధ్యానంలో వుండే ఆయనను స్మరిస్తే అన్ని రకాల భూత, ప్రేత, పిశాచ భయాలను పోగొడతాడు. ధ్యానముద్రలో స్వయంభువుగా వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి అవతరించిన క్షేత్రమే హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ఆలయం. వందల ఏళ్ల నుంచి భక్తులను దీవిస్తూ ధ్యానముద్రలో వున్న అంజ నాసుతుని దర్శనాన్ని చేసుకుంటే అన్ని రకాలుగా మంచి ఫలితాలు లభిస్తాయి.

ముఖ్యంగా సంతానం లేనివారు స్వామిని దర్శించి నిండుమనస్సుతో ప్రార్థిస్తే సంతానం కలుగుతుందని పెద్దలు చెబుతారు.

రెండో ప్రతాపరుద్రునికి దర్శనం..

క్రీ.శ. 1148లో కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించే రెండో ప్రతాపరుద్రుడు వేటాడుతూ అలసి ఇక్కడ ఒక రాయిపై విశ్రమిస్తాడు. కాసేపటికి అతనికి పులి గాండ్రింపు శబ్దాలు వినిపించడంతో అప్రమత్తుడ్కె విల్లంబులు ధరించి అక్కడకు వెళుతాడు.

అక్కడ ఏమి కనిపించకపోవడంతో తిరిగి రాయి వద్దకు వస్తాడు. మళ్లీ పులి గాండ్రింపు వినరావడంతో తిరిగి గాలిస్తాడు. అప్పుడు కూడా ఎలాంటి జంతువు కనిపించలేదు. అదే సమయంలో రామశబ్దం రావడంతో చేతులు జోడించి ఆ అద ృశ్యమూర్తిని ప్రార్థిస్తాడు. ధ్యానం చేస్తే దర్శనమిస్తానని ఆ మూర్తి స్వరం వినిపిస్తుంది. దీంతో రాజు అక్కడ ఏకాగ్రతతో ధ్యానం చేస్తాడు. కొద్దిసేపటికి ఇక లే నాయనా అంటూ స్వరం వినిపించడంతో రాజు కళ్లు తెరిచి ఆ శబ్దం వచ్చిన చోట వెతకగా ధ్యానాంజ నేయస్వామి విగ్రహం లభ్యమైంది.

పరమానందభరితుడ్కెన రాజు ఆ విగ్రహానికి పూజలు చేసి కోటకు తిరిగి వెళ్లిపోతాడు. ఆ రాత్రి కలలో స్వామివారు అతనికి ప్రత్యక్షమై తనకు ఆలయం నిర్మించమని ఆదేశిస్తారు. స్వామి అనుజ్ఞ ప్రకారం ఆలయాన్ని నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. స్వామివారిని అనంతరం కాకతీయ రాజులందరూ ఇష్టదైవంగా పూజించడంతో క్షేత్ర మహిమ అన్ని ప్రాంతాలకు వ్యాపించడంతో భక్తులు వేల సంఖ్యలో స్వామి దర్శనానికి వచ్చేవారు.

స్వామివారే హెచ్చరించారు..

17వ శతాబ్దంలో గోల్కొండ సామ్రాజ్యాన్ని మొగల్ పాలకుడు ఔరంగజేబ్ స్వాధీనం చేసుకున్నాడు. అతని సైన్యంలోని కొందరు ధ్యానాంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకొని ఆలయాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించారు. అయితే స్వామి దివ్యశక్తితో వారు విజయం సాధించలేకపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఔరంగజేబ్ స్వయంగా దాడికి దిగాడు. ఈ క్రమంలో ఆలయం వద్దకు చేరుకోగా ఆలయం నుంచి పెద్ద స్వరంతో 'మందిర్ తోడ్‌నా హైతో పహలె తుమ్ కరో మన్‌ఘట్'(ఆలయాన్ని ధ్వంసం చేయాలనుకుంటే మనస్సును గట్టిగా చేసుకో) అని పలికింది. దీంతో ఔరంగజేబ్ తనకు కనపడమని కోరగా తాటిచెట్టు కంటే ఎత్త్కెన రూపం కనిపించడంతో అతను భీతిల్లి వెనుదిరిగాడు. కరో మన్‌ఘట్ అన్న పేరే కర్మన్‌ఘాట్‌గా మారింది.

నిత్యపూజలు

స్వామివారి ఆలయంలో నిత్యపూజలు జరుగుతుంటాయి. రోజూ వందలాది మంది భక్తులు స్వామి వారి దర్శనం కోసం వస్తుంటారు. ఈ ఆలయ ప్రాంగణంలో పలు ఉపాలయాలను నిర్మించారు.

ప్రశాంతమైన వాతా వరణంలో వుండే ఆలయంలో స్వామివారి మూలవిరాట్ విగ్రహాన్ని దర్శించుకుంటే



మనసుకు ప్రశాంతత చేకూరు తుంది. కొత్తగా కొనుగోలు చేసిన మోటార్ వాహనాలకు ఇక్కడ పూజ చేయిం చడం సంప్రదాయం. నిత్యం అనేక వాహనాలకు శకట పూజ జరుగుతుంది.

ఇలా చేరుకోవచ్చు

హైదరాబాద్ నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఆలయం వుంది. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్‌ల నుంచి చేరుకోవచ్చు.

మీర్‌పేట్, జిల్లెల్లగూడ, నాదర్‌గుల్, ఆర్.ఎన్.రెడ్డినగర్...తదితర శివారు ప్రాంతాలకు వెళ్లే సిటీ సర్వీసులు కర్మన్‌ఘాట్ మీదుగానే వెళుతాయి.

# శాస్త్రీయ దృక్పథాన్ని విస్తృతంగా ప్రచారం చేద్దాం

## - మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్




కాకినాడ : విద్యాసంస్థలలో, గ్రామాలలో, పట్టణాలు సహా దేశవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ యం.గేయానంద్ పిలుపునిచ్చారు. జేఎన్టీయూకే కాకినాడలో ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ (ఏఐపిఎస్ఎన్) ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రెండు రోజుల జాతీయ రిసోర్స్ పర్సన్స్ వర్క్ షాప్ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్ వ్యతిరేక, హేతు విరుద్ధ అంశాలకు ప్రాధాన్యతనిస్తూ శాస్త్రీయతను, ప్రశ్నించే తత్వాన్ని బలహీనపరచలని చూస్తున్నాయన్నారు. దేశవ్యాప్త శాస్త్రీయ దృక్పథం క్యాంపెయిన్'లో భాగంగా ఏఐపిఎస్ఎన్ జాతీయ కార్యవర్గ సభ్యులు జి.మురళీధర్ అధ్యక్షతన గత రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ రిసోర్స్ పర్సన్స్ వర్క్ షాప్ కు ఫెసిలిటేటర్ లుగా హాజరైన ఏఐపిఎస్ఎన్ జనరల్ సెక్రెటరీ, ఆశా మిశ్రా, ఏఐపిఎస్ఎన్ సైంటిఫిక్ టెంపర్ డెస్క్ కన్వీనర్ ప్రొఫెసర్ అరుణభమిశ్రాలు మాట్లాడుతూ సైన్సును ప్రచారం చేయటం అనేది విద్యావంతులు, సైన్స్ రంగం కార్యకర్తల సామాజిక బాధ్యతన్నారు. మానవ మనుగడకు, సమాజ ప్రగతికి కారణమైన సైన్సును ప్రచారం చేసేందుకై శాస్త్రవేత్తలు మేరీ క్యూరీ, సి.వి.రామన్ లు పుట్టినరోజు అయిన నవంబర్ 7 నుండి ఈ క్యాంపెయిన్ ప్రారంభించి జాతీయ సైన్సు దినోత్సవం ఫిబ్రవరి 28 వరకు వివిధ దశల్లో దేశ వ్యాప్తంగా శాస్త్ర ప్రచారం నిర్వహించాలని తెలియజేశారు. సైన్స్ పై అవగాహనను పెంపొందింపజేసేందుకై రచయితలు, కళాకారులు, మెజీషియన్లు, సోషల్ మీడియా కార్యకర్తలతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. ఈ వర్క్ షాప్ లో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, జె.వి.వి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేఎంఎంఆర్ ప్రసాద్, టి.త్రిమూర్తులు, కె.శ్రీనివాస్, కె.వి.వి.సత్యనారాయణ, వై.యస్.నాగేశ్వర రావు, నిర్మల, డా.కాలేషా, పి.వి.గోపాల రావు, జి.గిరిధర్, కాకినాడ జిల్లా నాయకులు వి.శ్రీరామారావు, వర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ రిసోర్స్ పర్సన్స్ వర్క్ షాప్ కు దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర లకు చెందిన 100మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ వర్క్ షాప్ లో విద్యార్థులకు,ప్రజలకు శాస్త్రీయ అవగాహన పెంపొందించడం కోసం వివిధ సైన్స్ ప్రయోగాలను చేసేందుకు రిసోర్స్ పర్సన్ లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా సైన్సును ప్రచారం చేయడానికి అవసరమైన కళారూపాలను ప్రదర్శించడం జరిగింది.

విశ్వం ఆవిర్భావం- మానవుని పుట్టుక' ఒక పెద్ద సైన్స్ ......డాక్టర్ కాలేషా బాషా

ఏఐపిఎస్ఎన్ వర్క్ షాప్ లో సోమవారం సెషన్ లో విశ్వం ఆవిర్భావం- మానవుని పుట్టుక అనే అంశంపై నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా బాషా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సుమారు రెండు లక్షల సంవత్సరాల క్రితం ఆఫ్రికా ఖండం లో పరిణామం చెందిన హొమో సెపియన్ మానవ జాతి 65 వేల సంవత్సరాల క్రితం అక్కడినుండి వలసల రూపంలో భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించడం జరిగిందన్నారు. మానవుని జీనోమ్ (డి.యన్.ఏ) విశ్లేషిస్తే ప్రపంచ మానవులంతా 99.9 శాతం సారుప్యత కలిగి ఉన్నారని, కేవలం 0.1శాతం జీనోమ్ వ్యత్యాసంతోనే ఇప్పుడున్న మానవజాతులన్నీ ఏర్పడ్డాయని తెలిపారు.

ఈ మానవజాతి సాంప్రదాయాలు, సంస్కృతులు, మతాలు వంటివి తమకు తాము సృష్టించుకుని తమను తాము విభజించుకున్నారన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా మనదేశంలో కులవ్యవస్థ, అంటరానితనం వంటి అమానవీయ దురాచారాలు వ్యవస్థీకృతం చేయబడ్డాయన్నారు. ఈ క్రమంలో ఏర్పడిన మూఢాచారాలు, అశాస్త్రీయ ధోరణుల నుండి సమాజాన్ని మార్చేందుకు సైన్స్ సంస్థలు, ఉపాధ్యాయులు కృషి చేయవలసిందిగా డాక్టర్ కాలేషా బాషా కోరారు. అనంతరం

డాక్టర్ కాలేషా బాషా ప్రెజెంటేషన్ ద్వారా వివిధ రాష్ట్రాల నుండి హాజరైన ప్రతినిధులకు విషయ పరిజ్ఞానం పెంపుదలకు సంబంధించిన విషయాలను వివరించారు.

# స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థుల ర్యాలీ




విశాఖపట్నం : ఆరిలోవ తోట గరువు జడ్పీహెచ్ ఉన్నత పాఠశాల ఆవరణంలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థినీ విద్యార్థులు ఆధ్వర్యంలో ప్రపంచ ప్రమాణాల దినోత్సవం (అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం) ప్రతి సంవత్సరం నిర్వహించబడుతుంది.ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమ దేశాలలో ప్రమాణాలను నిర్ణయించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తోట గరువు, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ క్లబ్ మెంటార్ అనిమిరెడ్డి స్వామి నాయుడు తెలియజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి కె దుర్గ భవాని మాట్లాడుతూ ఐఎస్ఐ మార్క్ ఉన్న వస్తువులనే వాడాలని తెలియజేశారు. అనంతరం పాఠశాల చుట్టుపక్కల పరిసర ప్రాంతాల గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, డి కృష్ణవీర్ వర్మ స్టాండర్డ్ ప్రమోషన్స్ ఆఫీసర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నాము అని స్వామి నాయుడు మెంటార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థిని,విద్యార్థులు,ఇతర విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# ఉచిత సివిల్స్ కోచింగ్ మొదటి దశ పరీక్షకు 1631 మంది హాజరు

## - అక్టోబర్ 22న రెండవ దశ పరీక్ష - కలెక్టర్ సుమిత్ కుమార్..



అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్.. పాడేరు, ఐటిడిఏ ఫరిధిలో గల 11 మండలాలలో ప్రాజెక్ట్ లక్ష్య పేరుతో యువర్ విజన్-అవర్ మిషన్ కింద సివిల్ సర్వీసెస్ పరీక్షలకు అర్హతగల గిరిజన విద్యార్థులకు తొమ్మిది నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వటానికి నిర్ణయించామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ సివిల్స్ ఉచిత శిక్షణ ఎంపికకు సోమవారం శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాటశాల (బాలికలు)లో నిర్వహించిన మొదటి దశ పరీక్షను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ పరిశీలించారు. ఈ సందర్భాంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద మార్కులకు నిర్వహించిన సివిల్స్ ఉచిత శిక్షణ ఎంపిక పరీక్షకు 1753 మంది ధరఖాస్తూ చేసుకున్నారని, అందులో 1631 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షను పాడేరు, అరకు, చింతపల్లి మండలాలలోని ఏడు కేంద్రాలలో నిర్వహించామన్నారు. మొదటి దశలో సుమారు 500 మందిని ఎంపిక చేసి ఈ నెల 22 వ తేదీన రెండవ దశ పరీక్ష నిర్వహించి అందులో ఎంపికైన వారికి ఇదే నెలలో 30,31 తేదీలలో మౌఖిక పరీక్ష నిర్వహించి ఐటిడిఏ ఆధ్వర్యంలో వేపగుంట వైటిసిలో తొమ్మిది నెలల పాటు ఉచిత శిక్షణను అందించి వారిని సివిల్స్ ప్రిలిమ్స్ లో విజేతలుగా నిలపడానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. గిరిపుత్రులు దేశంలో అత్యున్నత స్థాయి ఉద్యోగం సాధించాలన్న ఆశయంతో చేస్తున్న ఈ కృషి ఫలవంతంయ్యేలా గిరిపుత్రులు, వారి తల్లిదండ్రులు సహకరించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ పరిశీలనలో ఎటిడబ్ల్యుఓలు ఎల్. రజని, వెంకటరమణ, పాతశాల ప్రాదానోపాధ్యయులు మంజుల తదితరులు పాల్గొన్నారు.

**సివిల్స్ ఉచిత కోచింగ్ పరీక్షకు హాజరైన అభ్యర్థుల మనోభావాలు...**



1.హుకుంపేట మండలం గడికించుమండ గ్రామానికి చెందిన కె. రవి తేజ మాట్లాడుతూ సివిల్స్ ప్రిలిమనరి పరీక్షల స్థాయిలో ఆధునికంగా ఉందని, కరెంటు అఫైర్స్, సమకాలీన అంశాల మేలవింపుతో పరీక్ష పత్రం సివిల్స్ ప్రిలిమినరీ కి ఉపయోగపడే విధంగా రూపొందించడం వల్ల చాల ఉపయోగంగా ఉంది.



2.హుకుంపేట మండలం గూడ గ్రామానికి చెందిన బి. సోఫియా మాట్లాడుతూ, పర్యావరణ, రాజకీయ, భౌగోళిక శాస్త్రాలు, చరిత్ర,, అర్థమెటిక్, రీజనింగ్ తదితర అంశాలపై అన్ని కొనాల నుండి వంద మార్కులకు తయారు చేసిన పరీక్ష పత్రం బాగుంది.

# దళితులకు టిడిపిలోనే అగ్రస్థానం

## - దళితులని చంపిన వారికి వైకాపాలో ఉన్నత స్థానం

## -టీడీపీ దళిత రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు






కాకినాడ, అక్టోబర్ 16 : దళిత సోదరుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య చేసిన ఎమ్మెల్సీ అనంత బాబు బెయిల్ రద్దుచేసి జైల్లో ఉంచాలని అదేవిధంగా రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని కోరుతూ త్వరలో భవిష్యత్తు కార్యచరణ చేపడుతున్నామని అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీలో దళితులకు వివిధ విభాగాల్లో అగ్ర స్థానం ఇవ్వగా అధికార వైకాపాలో మాత్రం దళితులు చంపిన వారికి ఉన్నత పదవులు ఇచ్చి వారిని హీరోలుగా చిత్రీకరిస్తున్నారంటూ వివిధ అఖిలపక్ష పార్టీలకు చెందిన దళిత నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అధికార వైకాపా ప్రభుత్వం దళితులకు పథకాలను రద్దు చేసి బికారులను చేస్తుందన్నారు. నేటికి కూడా ఆ పార్టీలో దళితులకు స్థానం లేకపోగా వారిని తరచు అవమానాలు గురిచేస్తుందంటూ చెప్పారు. ఇంకా ఈ సమావేశంలో ఆర్పిఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ పిట్ట వరప్రసాద్, సిపిఐ కాకినాడ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, టిడిపి మాజీ మంత్రులు గొల్లపల్లి సూర్యారావు, కొండ్రు మురళి, మహాసేన రాజేష్ టిడిపి మాజీ ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నరాల శివ, మోకా ఆనంద సాగర్, కాశీ నవీన్ కుమార్, గోపాలపురం టిడిపి ఇన్చార్జ్ తలారి వెంకటరాజు, మాకిరెడ్డి భాస్కర్ గణేష్, పప్పు దుర్గా రమేష్, చొల్లంగి వేణుగోపాల్ తదితరులు ప్రసంగించారు. నక్కా ఆనంద్ బాబు, కేఎస్ జవహర్, సిపిఐ, సిపిఎం నాయకులు తాటిపాక మధు, దువ్వా శేషుబాబ్జి జనసేన నేత పిట్టా జానకి రామారావు, బట్టు లీల, బండి సుజాత, బోడపాటి మరియలు ప్రసంగించారు.

# టీడీపీ గెలుపుని ఎవ్వరూ ఆపలేరు



రాజాం : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ని అక్రమ కేసులతో జైల్లో నిర్భందించినంత మాత్రాన, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ గెలుపును ఎవ్వరూ ఆపలేరని బీసీ సెల్ అధ్యక్షులు గురవాన నారాయణ రావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం ముందు చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రాజాం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్, మాజీమంత్రి కోండ్రు మురళీమోహన్ ఆదేశాలు మేరకు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసమే అహర్నిశలు శ్రమిస్తూ ఉంటారని తెలిపారు. రాజాం టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ కుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు తెలుసుకున్నారని, మరో ఛాన్స్ ఇస్తే, రాష్ట్రాన్ని అమ్మేస్తాడనే భావన వారిలో నెలకొందని అన్నారు. ఇటువంటి సైకో పాలనని మునుపేనాడు చూడలేదని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమం లో కిమిడి అశోక్, దూబ ధర్మారావు, పిల్లా సత్యం నాయుడు, పాలూరి రామినాయుడు, పొట్నూరు సోమశేఖర్, గన్ను రమేష్, పొన్నాడ భీమేశ్వరరావు, కోడిస రమేష్, వల్లూరు గణేష్, గడిముడిదాం శంకర్, లక్ష్మీపేట ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి కృషి



కాకినాడ, అక్టోబర్ 16: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో స్థానం సంపాదించుకున్న ముగ్గురు పార్టీ నాయకులను సోమవారం ఘనంగా సన్మానించారు. కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మట్టా శివప్రసాద్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులుగా ఆకుల వెంకటరమణ, పెద్దాడ సుబ్బారాయుడులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మట్టా శివప్రసాద్, ఆకుల వెంకటరమణ, పెద్దాడ సుబ్బారాయుడులు మాట్లాడుతూ చోటు కల్పించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి తగు చర్యలు చేపట్టి పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, నగర అధ్యక్షుడు దాట్ల గాంధీ రాజు, ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు, నియోజవర్గ ఇన్చార్జిలు కోలా ప్రసాద్ వర్మ, మారోతు శివ గణేష్, ఉమ్మిడి వెంకట్రావు, మేడిది శ్రీను, తుమ్మల దొరబాబు, కుక్కల పోతురాజు, సూర్య ప్రకాష్ రావు, బత్తిన లలిత, బుర్ర పద్మనాభం, అబ్బా రెడ్డి, జ్యోతి, నారయ్య, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శంబర పోలామాంబ ఆలయములో శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించారు



సాలూరు విజయ భాను న్యూస్ అక్టోబర్ 16 పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు నియోజకవర్గం, మక్కువ మండలం శంబర గ్రామంలో వేంచేసియున్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవతగా వెలుగొందుతున్న శ్రీ శ్రీ పోలామాంబ అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహెూత్సవములు రెండవ రోజు సోమవారం అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అమ్మవారికి పసుపు కొమ్ములు, గాజులతో ప్రత్యేక అలంకరణ చేయడమైనది. సాయంత్రం సహస్ర కమలార్చన పూజ విశేషంగా జరిగినది ఉదయం మరియు సాయంత్రం విశేష హెూమములు జరిపారు, సాయంత్రం ఏడు గంటలకు దేవీ భాగవత ప్రవచనములు పెంట సింహాచలం నాయుడు, యాళ్ల భాస్కర రావు, లంక వరకు ప్రకాశరావు, బోత్స హరి ప్రసాద్ వార్లచే వైభవంగా చెప్పబడినది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పూడి దాలి నాయుడు, ధర్మకర్తలు గ్రామ పెద్దలు కళాకారులు అత్యధికంగా పాల్గొన్నారు. తదుపరి భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేయడమైనది. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి వాకచర్ల రాధాకృష్ణ సూచనలు సలహాలతో తగు ఏర్పాట్లు చేయడమైనది. శంబర పొలామాంబ ఆలయములో దేవి శరన్నవరాత్రి ఉత్సవములు ఘనంగా నిర్వహించారు అని చైర్మన్ పూడి దాలి నాయుడు, కమిటీ మెంబర్లు, ఈవో రాధాకృష్ణ, గుమస్తా మురళి తదితరులు పాల్గొన్నారు.

# చీకటి రోజులు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయి : తేదేపా నేతలు

## 'న్యాయానికి సంకెళ్లు" తో తేదేపా నేతల నిరసన



రాజాం :మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ ఆదేశాల మేరకు "బాబుతో నేను" కార్యక్రమంలో భాగంగా ఆదివారం వారం నాడు రాజాం టౌన్ అధ్యక్షులు నంది సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు అభిమానులతో కలిసి రాజాం పట్టణంలో గల వస్త్రపురి కాలనీలో 'బాబుతో నేను' కరపత్రాలను ఇంటింటికీ వెళ్ళి పంపిణీ చేశారు. అనంతరం సాయంత్రం నాయకులు కార్యకర్తలు అభిమానులతో కలిసి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు.రాత్రి 7:00 గంటల నుండి 5 నిమిషాల పాటు నాయకులు కార్యకర్తలు చేతికి నల్ల తాళ్ళ సంకెళ్ళు కట్టుకొని చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నిరసన తెలిపారు,ఈ కార్యక్రమంలో తెదేపా నేతలు మాట్లాడుతూ ఈ వైసీపీ నియంత ప్రభుత్వం కు రాబోయే రోజుల్లో పతనం అవ్వడం తథ్యం అన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ తెదేపా నాయకులు పొట్టా చిట్టి బాబు,టంకాల కన్నం నాయుడు, శాసపు రమేష్ కుమార్,వస్త్రపురి కాలనీ ఇన్చార్జి టెంటు కమల్ నాయుడు,జరజాన నీలయ్య,మరిపి జగన్ మోహన్ రావు, నాగళ్ళ ప్రసాద్,గన్ను రమేష్, సూరిబాబు, కాటం శ్రీను, రమణ, పెంకి గౌరీశ్వర రావు తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# విశాఖ లో సీఎం జగన్‌కు ఘన స్వాగతం

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పర్యటన నిమిత్తం సోమవారం ఉదయం విశాఖ విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్,, జిల్లా ఇంఛార్జి మంత్రి విడదల రజని, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డా. మల్లిఖార్జున, నగర పోలీస్ కమిషనర్, అనకాపల్లి ఎస్పీ, ఎంపీలు ఎం.వి.వి. సత్యనారాయణ, బి. సత్యవత, జి. మధవి, జిల్లాపర్షత్ చైర్ పర్సన్ జి. సుభద్ర, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పలు అనుబంధ సంఘాల అధ్యక్షులు తదితరులు



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.